క్లుప్తంగా

తహసీల్దార్ శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

సామర్లకోట: స్థానిక తహసీల్దార్ వై.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేసిన లక్ష్మి ఏలూరు జిల్లా ముదినేపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. గుడ్లపల్లేరు తహసీల్దార్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా రెవెన్యూ సేవ లందిస్తానన్నారు. అనంతరం స్థానిక కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

200 మందికి కంటి వైద్య పరీక్షలు



శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న జాన్‌మోజెస్

సామర్లకోట: స్థానిక ట్రూ గాస్పల్ చర్చిలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మందిర నిర్వాహకుడు డాక్టర్ ఈలి సువార్తరాజు అధ్యక్షతన నిర్వహించిన శిబిరంలో పిఠాపురం అగ్రహారం సీఎంసీ ఆసుపత్రి వారిచే సుమారు 200 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, 20 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సువార్త రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో షారోన్ సువార్తరాజు, నూతలపాటి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామానికి చెందిన ఉప్పరపల్లి మాంబిల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని గురువారం మత్స్యకార నాయకుడు మడదా విష్ణుష్, రాజేశ్వరి దంపతులు పరామర్శించి, రూ.వెయ్యి విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు.

లారీ యూనియన్ మాజీ అధ్యక్షుడి మృతి



నారాయణస్వామి (ఫైల్)

కొత్తపల్లి: వాకతిప్పకు చెందిన జ్యోతుల నారాయణస్వామి(95) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తపల్లిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖరస్వామి ఆలయ చైర్మన్‌గా, కొత్తపల్లి మేజర్ పంచాయతీ సభ్యుడిగా, వాకతిప్ప ఉప సర్పంచ్‌గా, పిఠాపురం లారీ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఆయన వ్యవహరించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు.

చినరాజప్ప ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కుమారారామ భీమేశ్వర స్వామి, తిరుపతి శృంగార వల్లభ స్వామి ఆలయాలను దర్శించుకున్న అనంతరం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో గతంలో తాను చేసిన నియోజకవర్గ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

బోట్‌క్లబ్: కాకినాడలో పురాతన ఆలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంతచెరువు వద్ద నున్న కామాక్షి అమ్మవారి ఆలయంలో రూ. 15 లక్షలతో నిర్మించిన అన్నదాన మండపాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో మహిమ గల కామాక్షి అమ్మవారి ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆలయ కమిటీ చైర్మన్ అరటికట్ల రాంబాబు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు, బాలాత్రిపుర సుందరి ఆలయకమిటీ మాజీ చైర్మన్ జొన్నాడ చినబాబు పాల్గొన్నారు.

చదువుల ఒరవడి



వాకతిప్ప ఎంపీపీ పాఠశాల

- వరుసగా ఐదో ఏడాది అమ్మ ఒడి పథకం అమలు
- మండలంలో లబ్ధిదారులు 6,405 మంది

కొత్తపల్లి మండలంలో అమ్మ ఒడి వివరాలు..

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	నగదు(రూ.ల్లో)
2019-20	6,190	9,28,50,000
2020-21	7,306	10,95,90,000
2021-22	7,441	11,16,15,000
2022-23	6405	9,60,75,000
మొత్తం	27,342	41,01,30.000

కొత్తపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగేళ్ల నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకంతో నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు చదువుకు దగ్గరయ్యారు. వారిని పాఠశాలల నుంచి దూరం కాకుండా చేస్తున్న ఈ పథకాన్ని ఐదో ఏడాది సైతం అందించేందుకు ప్రభుత్వం సమయాత్తమైంది. దీనిపై విద్యా శాఖతో పాటు, సచివాలయ, ఇతర ప్రభుత్వ శాఖలు కసరత్తు ప్రారంభించాయి.

6,405 మంది తల్లుల ఖాతాలకు..

కొత్తపల్లి మండల స్థాయిలో ఒకటి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్న 6,405 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి గతేడాది ప్రభుత్వం రూ.9,60,75,000 జమ చేసింది. క్రమం తప్పకుండా ప్రతి ఏటా అమ్మ ఒడిని విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి జమ చేయడం వల్ల పాఠశాలలో బడి ఈడు పిల్లల తగ్గుదల 2023-24లో నమోదు కాలేదు. గత రెండేళ్లుగా ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను కూడా ప్రభుత్వం పంపిణీ చేసింది.

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

2023	780
2024	1,026

అర్హులందరికీ వర్తింపు



అమ్మ ఒడి పథకం అర్హులందరికీ వర్తిస్తుంది. ఇప్పటికే విద్యార్థుల తల్లుల నుంచి తీసుకున్న వివరాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం. లబ్ధిదారుల సంఖ్యను కుదిస్తున్నారని, అర్హుల పేర్లను తొలగిస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ అపోహలు మాత్రమే. అర్హత ఉన్న ప్రతి విద్యార్థి పేరును నమోదు చేస్తాం. పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు గత రెండేళ్లుగా పంపిణీ చేస్తున్నారు. నాడు-నేడు పథకం కింద పాఠశాలలను ప్రభుత్వం ఉన్నత స్థాయి స్థితికి తీసుకెళ్లింది.

– వేణుగోపాల్, ఎంఈఓ, కొత్తపల్లి

మా పిల్లలకు మేనమామ జగనన్న



మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. పిల్లల చదువుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం జగనన్న అధికారంలోకి వచ్చి, మా పిల్లలకు అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించడమే కాకుండా, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా యూనిఫాం, పుస్తకాలు అందించారు. మా ఇద్దరు పిల్లలకు మేనమామగా నిలుస్తున్న జగనన్నకు ఎన్నటికీ రుణపడి ఉంటాం.

– మేడే అంజనీసమీరా, విద్యార్థినుల తల్లి, కొమరగిరి

జగనన్న వెంటే ఉంటాం



ఎంతోమంది ముఖ్యమంత్రులుగా వచ్చారు. పేదవారి పిల్లల చదువులను పట్టించుకోలేదు. జగనన్న మాత్రం అమ్మ ఒడి ఇచ్చారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. మా పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నామనే విధంగా తయారు చేశారు. పౌష్టికాహారంలో మార్పు తెచ్చి మా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మా అన్న తోనే మా కుంటుంబం అంతా నడుస్తుంది.

– చిత్రాడ సత్యవతి, విద్యార్థిని తల్లి, ఉప్పాడ

పాల వెల్లువ కేంద్రాలతో రైతులకు మేలు



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ

కొత్తపల్లి: పాడి రైతుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న జగనన్న పాల వెల్లువ కేంద్రాలతో వారికి ఎంతో మేలు జరుగుతుందని పశు సంవర్ధన శాఖ ఏడీ రమేష్‌చంద్ర అన్నారు. పాల వెల్లువ కేంద్రాల ఏర్పాటుపై మండలంలోని వాకతిప్పలో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో తొలి విడతలో పది పాల వెల్లువ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. రెండో విడతలో శ్రీరాంపురం, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో పాల వెల్లువ కేంద్రాలు మంజూరైనట్టు చెప్పారు. ఆయా కేంద్రాల్లో మండలంలో రెండు పూటలా సుమారు వెయ్యి లీటర్ల పాలను కొనుగోలు చేస్తారని వివరించారు. ప్రభుత్వ కేంద్రాల్లో పాల వెన్న శాతాన్ని బట్టి రూ.60 నుంచి రూ.110 వరకూ ధర కల్పిస్తారని తెలిపారు. ఈ కేంద్రాలకు పాలు పోసే పాడి రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలను కూడా మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనారాయణ, కొత్తపల్లి పశు వైద్యాధికారి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం ఎందుకు?

- అధికారులు పద్ధతి మార్చుకోవాలి
- పెద్దాపురం మండల సమావేశంలో వైస్ చైర్మన్, సభ్యుల ధ్వజం



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

పెద్దాపురం: పట్టణ పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి పనులపై శానిటరీ, ఇంజినిరింగ్ అధికారుల వ్యవహార శైలిపై మున్సిపల్ కౌన్సిల్ మండిపడింది. పట్టణంలో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్లు, పైపులైన్ల నిర్వహణలో ఇంజినీరింగ్ అధికార్ల అలసత్వంపై కౌన్సిల్ సాధారణ సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, పప్పుల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు కొందరిని తీసుకుని మెరుగుపరచాలన్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కమిషనర్ కేవీ పద్మావతి సమాధానం ఇస్తూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో సిబ్బందిని తీసుకునే అవకాశం లేదని సమాధానం ఇచ్చారు. వారానికి ఒకసారైనా డ్రైడే నిర్వహించాలని సభ్యులు కోరగా ఆ రోజున సామూహికంగా డ్రైడే నిర్వహిస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు పేర్కొన్నారు. వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, కౌన్సిలర్ విజ్జరపు రాజశేఖర్ తదితరులు పారిశుధ్యం మెరుగుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇంజినీరింగ్, శానిటరీ అధికారుల తీరుపై కౌన్సిల్ సభ్యులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తడంతో సమావేశం వాడీవాడిగా కొనసాగింది. కాగా పట్టణంలో ఎక్కడా మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలని వైస్ చైర్మన్ సాయి ప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారులు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడి చర్చ సాగింది. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, ఆర్‌ఓ చంద్రశేఖరం. కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, పెంటకోట సత్తిబాబు, పేరింశెట్టి అంబిక తదితరులు పాల్గొన్నారు.

‘మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం’ ఏర్పాట్ల పరిశీలన



కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలిస్తున్న దొరబాబు

పెద్దాపురం: ఎన్నికల శంఖారావం పూరించేందుకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక స్వర్ణదేవాలయం ఎదురుగా ఉన్న మైదానంలో నిర్వహించే సిద్ధం సమావేశ ఏర్పాట్లును గురువారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను కార్యకర్తలు, బూత్ ఏజెంట్లతో సమావేశమై ఎన్నికల శంఖారావానికి సంబంధించి దిశా నిర్దేశం చేయనున్నట్టు తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో లోకల్ మెనిఫెస్టోను ప్రజలకు వివరించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే రాజప్ప తానే అభివృద్ధి చేశానని ప్రకటనలు చేసుకుంటున్నారు తప్పా, తాను దత్తత తీసుకున్న జె.తిమ్మాపురంలో కనీస వసతులు కల్పించిన దాఖలాల్లేవన్నారు. హౌసింగ్ చైర్మన్‌గా ఉన్న తాను ఆ గ్రామంలో అభివృద్ధి పనులు చేసినట్టు దవులూరి తెలిపారు. జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలు, స్థానికుడిగా రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని దొరబాబు అన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వ్యక్తి కంటే స్థానికుడిగా ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న నన్ను నియోజవకర్గ ఓటర్లు దీవించి అసెంబ్లీకి పంపించాలని దొరబాబు కోరారు. అనంతరం బూత్ స్థాయి సిద్ధం కార్యక్రమానికి చేపట్టాల్సిన అంశాలపై ఆయన నాయకులతో చర్చించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, గోపు మురళి, గోలి రామారావు, తలారి దొరబాబు తదితరులు ఉన్నారు.

సాగునీటి పంపిణీపై కమిటీ ఏర్పాటు



రైతులతో కమిటీ ఏర్పాటుపై చర్చిస్తున్న అధికారులు

పిఠాపురం: సాగునీరు వంతుల వారీగా విడుదల అవుతున్నప్పటికీ, రైతుల్లో సమన్వయం లేకపోవడం వల్ల శివారు ప్రాంతాల పొలాలకు అందడం లేదు. ఈ సమస్యను పరిష్కరించడానికి కమిటీ ఏర్పాటు చేసి సమస్యను క్రమబద్ధీకరిస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. పిఠాపురం మండలంలోని పి.రాయవరం, పి.దొంతమూరు శివారులో ఉన్న భూములను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి ఎద్దడిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి, పరిస్థితులను సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. గ్రామ స్థాయిలో వీఏఏ, వీఆర్‌ఓ, పోలీస్ సిబ్బంది, లస్కర్, ఇద్దరు రైతులతో కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ ఏర్పాటుపై రైతులు ఏకగ్రీవంగా అంగీకరించారన్నారు. ఆయన వెంట పెద్దాపురం నీటి పారుదల శాఖ ఈఈ రాంగోపాల్, ఏడీఏ పి.స్వాతి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని: మహాత్మా జ్యోతిరావు పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్.అన్నవరం పాఠశాల ప్రిన్సిపాల్ పి.యజ్ఞ గురువారం ఓ ప్రకటనలో కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి(ఇంగ్లిష్ మీడియం)లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నాలుగో తరగతి చదివి ఉండాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ బాలురు మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాకినాడ జిల్లాలో తుని, పెద్దాపురం, కరపలో ఈ పాఠశాలలు ఉన్నాయన్నారు. అర్హత కలిగిన బాలురు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు

పెద్దాపురం: ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉత్సవ ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్మిక నాయకుడు దవులూరి సుబ్బారావు సూచించారు. సామర్లకోట కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఆలయ ఈఓ. నీలకంఠం అధ్యక్షతన ఉత్సవ ఏర్పాట్లుపై అధికారుల, ప్రజా ప్రతినిధులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజప్ప, సుబ్బారావు మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్, దేవదాయ శాఖ అధికారులు సమన్వయంతో ఉత్సవం విజయవంతానికి సహకరించాలని వారు కోరారు. అనంతరం మహా శివరాత్రి ఉత్సవ వాల్‌పోస్టర్‌ను రాజప్ప, సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కంటే బాబు, మున్సిపల్ కమిషనర్ రామారావు, అగ్నిమాపక అధికారి ప్రసాద్. కౌన్సిలర్ సేపేని సురేష్, దూది రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి స్వర్ణ పతకం



సురేంద్ర లక్ష్మణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి: పిఠాపురంలో ఇటీవల నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో గొల్లప్రోలు మండలం చెందుర్తి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి జి.సురేంద్ర లక్ష్మణ్ ప్రదర్శించిన ప్రాజెక్ట్ ప్రథమ స్థానం సాధించింది. దీంతో అతడు స్వర్ణ పతకం, ల్యాప్‌ట్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ సందర్భంగా సురేంద్ర లక్ష్మణ్‌ను ఎంఈఓలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్‌ఎం ఎస్.సురేష్‌కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.రామకృష్ణ, సర్పంచ్ ఏ.నూకరాజు, ఉప సర్పంచ్ కె.పెదబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్ సెంటర్ ప్రగతిపై కమిషనర్ ఆరా



సైన్స్‌సెంటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీఈవో వెంకటరావు

కాకినాడ: నగరపాలకసంస్థ కమిషనర్, స్మార్ట్ సిటీ సీఈవో, ఎమ్‌డీ జె.వెంకటరావు గురువారం సైన్స్ సెంటర్‌ను సందర్శించారు. రాజాట్యాంక్ పార్కు ఆవరణలో రూ.15 కోట్లతో ఈసైన్స్ సెంటర్ నిర్మాణమవుతోంది. స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు నిర్మాణ ప్రగతిని కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు, మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాల ఎగ్జిబిషన్ల నిర్వహణ, ఇతర వైజ్ఞానిక అంశాలకోసం ఈ సైన్స్ సెంటర్ నిర్మాణమవుతోందన్నారు. నిర్మాణ పనులు, టెండర్ ప్రక్రియలను వేగవంతం చేసి త్వరగా వినియోగంలోకి వచ్చేలా ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటరావు, డీఈ రామారావు సిబ్బంది ఉన్నారు.

ఎప్పాస్ బేరం అనుకున్నారా?

- ముందస్తుగానే సొమ్ములు చెల్లిస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు
- నిర్దేశిత ప్రాంతాల్లో బస్సులు నిలపకపోవడంతో విద్యార్థుల అవస్థలు
- విద్యార్థుల భద్రతలో ఆర్టీసీ బాధ్యతగా ఉండాలి
- పాఠశాలల వేళల్లో సర్వీసుల పెంచాలి



పీఆర్ కళాశాల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



లిఫ్ట్‌కోసం జేఎన్‌టీయూకే గేటు వద్ద వేచి చూస్తున్న విద్యార్థులు

బాలాజీచెరువు: ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లకి నచ్చని ఒకే ఒక్క పదం పాస్. ఎవరైనా ప్రయాణికుడిని టికెట్ అని అడగ్గానే అటు నుంచి పాస్ అనే జవాబు వస్తే కండక్టర్ ముఖంలో రంగులు మారిపోతాయి. తన టిక్కెట్ల విక్రయం నుంచి కొంత కలెక్షన్ తగ్గిపోతుందనో.. లేక ఇంత టార్గెట్ అని వారికి ఏమైనా ఉంటుందో తెలీదు కానీ దాదాపు అందరు కండక్టర్ల వ్యవహార శైలీ ఇదే తీరుగా ఉంటుంది. పాస్ హోల్డర్లు ఏకమొత్తంగా చెల్లించే డబ్బు సంస్థ అభివృద్ధికి, నిర్వహణకే తమ యాజమాన్యాలు వెచ్చిస్తున్నాయన్న విషయాన్ని ఆయా కండక్టర్లు, డ్రైవర్లు విస్మరించడం నిజంగా శోచనీయం. మరో వైపు చూస్తే విద్యార్థులు నిజానికి చిన్న పిల్లలు. ఆ వయసులో కాకపోతే ఇంకెప్పుడు చేస్తారు అల్లరి. వారి అల్లరిని భరించలేము. గోలగోల అనుకుంటే ఎలా? వారిలో డ్రైవర్లు, కండక్టర్ల పిల్లలు కూడా ఉంటారన్న విషయాన్ని విస్మరించకూడదు కదా? విద్యార్థుల పాస్‌లను యాజమాన్యం అప్పనంగా ఇచ్చేస్తున్నట్టు ఫీలైపోతే ఎలా? వారు ఎప్పాస్ బేరం కాదని గుర్తించాలి. వారంతా ముందే కట్టేస్తున్న సొమ్ములకు కృతజ్ఞతా భావంతో వారికి తమ సేవల ద్వారా బాధ్యతతో ప్రయాణాల్లో, రాకపోకల్లో భాగం కల్పించాలి. విద్యార్థులు ఉన్నచోట ఆపకుండా మరెక్కడో ఆపితే సీటు కోసం వారు పరుగులెడితే.. ఫుట్‌బోర్డుపై వేలాడితే పడిపోతారేమోనన్న కనీస ఆలోచనతో వారికి సేవలు అందించాలి. జరగరానిది జరిగితే చేసేదేమీ ఉండదు. డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థులపై కనీస వాత్సల్యం ప్రదర్శించాలి.

నెలవారీ, త్రైమాసిక, అర్ధ సంవత్సర ప్రాతిపదికన విద్యార్థుల నుంచి బస్ పాసులు వసూలు చేస్తున్నా వారిని బస్సుల్లో ఎక్కించుకోవడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో వారు ఏం చేయాలో తెలియక అటు కళాశాలకు, ఇటు ఇంటికి చేరుకోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. జిల్లా కేంద్రం కాకినాడలో ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిగ్రీలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు దాదాపు 50 వరకూ ఉన్నాయి. ఈ కళాశాలల్లో విద్యను అభ్యసించడానికి సమీప ప్రాంతాలైన పిఠాపురం, కత్తిపూడి, సామర్లకోట, అనపర్తి, రామచంద్రపురం, కాజులూరు వంటి ప్రాంతాల నుంచి విద్యార్థులు ఆర్టీసీ బస్సులపై ప్రయాణిస్తుంటారు. సామర్లకోట వైపు వేళ్లే వారు ఇంద్రపాలెం బ్రిడ్జి, పిఠాపురం నుండి వేళ్లే వారు భానుగుడి తదితర ప్రాంతాల్లో బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. అయితే ఆర్టీసీ బస్సు డ్రైవర్లు మాత్రం విద్యార్థులు గుంపుగా ఉన్న ప్రాంతాల్లో ఆపకుండా ప్యాసింజర్లు అధికంగా ఉన్న చోట అపడంతో విద్యార్థులు బస్సు ఎక్కడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే విద్యార్థుల రాకపోకలు ఉంటాయి. సామాన్య ప్రయాణికులు, విద్యార్థులు ఉంటారన్న అంచనాతో ఆ సమయాల్లో ప్రత్యేక బస్సులు వేయకపోగా నిరంతరం నడిచే సర్వీసులనే నడుపుతూ విద్యార్థులను ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోంది. కాంప్లెక్స్‌కు వెళ్లి ఎక్కువదామంటే ఆటో ఎక్కిదిగితే పది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో విద్యార్థులు నరకయాతన పడుతూ ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారు. అబ్బాయిలైతే ఏవరో ఒకరు బైక్ లిఫ్ట్ అడిగి కాంప్లెక్స్‌కు చేరుకుంటున్నారు. అమ్మాయిలు ఏ సమయమైనా బస్సు వచ్చే వరకూ ఆగి వారు ఎక్కించుకుంటేనే ప్రయాణించే దుస్థితి ఏర్పడుతోంది. అధికారులు వీటిపై దృష్టి సారించి సాయంత్రం, ఉదయం వేళల్లో విద్యార్థులు ఉన్న చోట బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతి సాయంత్రం లిఫ్ట్ ప్రయాణమే..

ఐటీఐ నుంచి భానుగుడి వరకూ వెళ్లాంటే నడిచో లేక ఏవరో ఒకరి బైక్ లిఫ్ట్ ద్వారా చేరుకోవాల్సి వస్తోందని విద్యార్థులు అంటున్నారు. కిలో మీటరు దూరమైనా ఆటో వాళ్లు పదిరూపాయలు వసూలు చేస్తారు. బస్సులు సమయానికి ఆపకపోవడంతో అవస్థలు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

విద్యార్థి సంఘాలతో పోరాటం



సమీప ప్రాంతాల విద్యార్థుల ప్రయాణ సమస్యపై విద్యార్థి సంఘాలతో పోరాటం చేశాం. అనేక సార్లు ఆర్టీసీ అధికారులను కలిసి బస్సు పాసులు ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసుల నడపాలని కోరాం. విద్యార్థుల ఉన్న చోట బస్సులు ఆపాలని కోరుతున్నాం.

– టి.రాజా, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

సామాజిక సేవా వేదిక ఎన్ఎస్ఎస్

- ఎంపీ వంగా గీత



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ గీత, చిత్రంలో వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సామాజిక సేవ చేయాలనుకునే వారికి ఎన్ఎస్ఎస్ మంచి వేదికగా నిలుస్తుందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో పంచ్‌ప్రాణ్ యువజన సంభాషణ, భారత్‌కే పంచ్‌ప్రాణ్-ఏక్ యువ పరిచర్చ్ అనే నినాదంతో ‘యువ సంవాద్-ఇండియా 2047’ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఈనాడు ప్రపంచ దేశాలన్నీ భారత దేశం వైపు చూస్తున్నాయని, మానవ కేంద్రిత అభివృద్ధి దిశగా ప్రపంచం పయనిస్తోందన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ మనం సాధించే ప్రగతి భావి తరాలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని, కోవిడ్-19 తర్వాత విద్య, వైద్యం సామాజిక రంగాలలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. జేఎన్‌టీయూకేలో ఎన్ఎస్ఎస్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఉపయోగపడేలా ఉండటం సంతోషమని, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గత వారం 420 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించం సంతోషించదగ్గ విషయన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్, ఇంక్యుబేషన్ సెంటర్ ప్రత్యేక అధికారి మాలోతు రమేష్, బీజేపీ నాయకులు గట్టె సత్యనారాయణ, పెద్ది రవికిరణ్ పాల్గొన్నారు.